క్లుప్తంగా

ఆలయాల అభివృద్ధికి సహకారం



విరాళం అందజేస్తున్న పృథ్వీరాజ్

పటాన్‌చెరు: ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని ఎండీఆర్ ఫౌండేషన్ కోఫౌండర్ పృథ్వీరాజ్ అన్నారు. శనివారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్మిస్తున్న పెద్దమ్మతల్లి దేవాలయానికి పృథ్వీరాజ్ రూ.లక్ష రూపాయల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయ అధ్యక్షుడు రఘు, మాజీ వార్డు మెంబర్ యాదగిరి, సభ్యులు పృథ్వీరాజ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు మధు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ



అపార్ ప్రక్రియను పరిశీలిసున్న ఎంఈఓ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని పలు పాఠశాలలను శనివారం ఎంఈఓ మారుతి రాథోడ్ తనిఖీ చేశారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఉదయం న్యాల్‌కల్, ఇతర గ్రామాల్లో ఉన్న పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అపార్ (ఆటోమెటెడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) త్వరగా పూర్తి చేయాలని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు సూచించారు. ఈ నెల 3లోపు పూర్తి చేయాలని కోరారు. ఆయన వెంట ఎంఐఎస్ కోఆర్డినేటర్ రవి ఉన్నారు.

ఘనంగా నవగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న భక్తులు

వట్‌పల్లి (అందోల్): మండలంలోని మేడికుందా గ్రామంలో శివపంచాయతన నవగ్రహ, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపనోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు గంగసేకరణ, యాగశాల ప్రవేశం, గణపతి గౌరిపూజ, మండపారాధన, అగ్ని ప్రతిష్ఠ, గణపతి హోమం, జలాధివాసం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. నవగ్రహాలను గ్రామంలో పురవీధుల గుండా ఊరేగింపు చేపట్టగా గ్రామంలోని మహిళలు విగ్రహాలకు మంగళహారతులు పట్టారు. అనంతరం ఆలయం వద్ద విగ్రహాలకు జలాదివాసం చేశారు. ఉత్సవాల్లో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మున్సిపల్‌లో సిబ్బంది సంఖ్య పెంచండి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

నారాయణఖేడ్: ప్రజల అవసరాలకు అనుగుణంగా మున్సిపల్ కార్మికులను నియమించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. ప్రస్తుతం సిబ్బంది అంతంత మాత్రంగానే ఉండడంతో ఉన్నవారిపై అధికభారం పడుతుందన్నారు. పెరిగిన కాలనీలు, జనాభా అవసరాలకు అనుగుణంగా మరో 20 మందిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు శకుంతల, కుమార్, సిద్దమ్మ, సుధాకర్, ఏసు, మరియమ్మ, బేబి, సాయమ్మ, సాయిలు, గోపాల్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్



నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఓ పాఠశాలలో శనివారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. విద్యార్థులు పలు రకాల సైన్స్, మ్యాథ్స్, ఆర్ట్స్‌కు సంబంధించిన ప్రాజెక్టు వర్క్స్ ప్రదర్శించారు. ప్రాజెక్టు పనితీరును తోటి విద్యార్థులు, తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో మనోవికాసాన్ని పెంపొందించడానికి సైన్స్‌ఫెయిర్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరద కాల్వలపై అక్రమార్కుల కన్ను

- ఫిర్యాదు చేస్తేనే చర్యలు
- కాలనీలు ముంపునకు గురయ్యే ప్రమాదం
- ఆందోళనలో కాలనీవాసులు



వరద కాల్వలపై సిమెంట్ పైపులు వేసిన అక్రమార్కులు



నామమాత్రంగా పైపులను తొలగించిన అధికారులు

రామచంద్రాపురం (పటాన్ చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో భూముల ధరలు కోట్ల రూపాయలు ఉండడంతో కబ్జాదారులు వరద కాల్వలు, కుంటలను కూడా వదలడం లేదు. ఇష్టానుసారంగా కబ్జాలు చేస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం తెల్లాపూర్ పరిధిలోని కుమ్మరిగుంట వరద కాలువను మట్టితో పూడ్చి కబ్జా చేసి సిమెంట్ పైపులు వేశారు. స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. విషయం కలెక్టర్ దృష్టి తీసుకుపోవడంతో పైపులను రెండు మూడు రోజుల తర్వాత నామమాత్రంగా తొలగించారు. ఇప్పటికే అనేక కుంటలు, చెరువులు, వరద కాల్వలు కబ్జాకు గురయ్యాయి. జిల్లా ఉన్నతాధికారులు కబ్జాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా.. స్థానిక అధికారులు క్షేత్ర స్థాయిలో ఎందుకు కాపాడడం లేదన్న ప్రశ్న స్థానికుల్లో వ్యక్తమవుతుంది. సెలవు రోజుల్లో మాత్రమే కబ్జా కార్యక్రమాలు సాగుతున్నాయి. కబ్జాలపై స్థానిక ప్రజల ఒత్తిడి ఎక్కువ అయితేనే అధికారులు చర్యలు తీసుకుంటున్నారే తప్ప కబ్జాలను నిరోధించడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు కాల్వలు, కుంటలను కాపాడకపోతే రానున్న రోజుల్లో ఈ ప్రాంతాలు వరద ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. అధికారులు క్షేత్రస్థాయిలో అక్రమార్కుల కబ్జాల నుంచి ప్రభుత్వం స్థలాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి



వరద కాలువలను కాపాడకపోతే రానున్న రోజుల్లో ఈ ప్రాంతం ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. స్థానికులు అధికారులపై ఒత్తిడి తీస్తేనే నామమాత్రంగా చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానంగా నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులను గుర్తించి చర్యలు తీసుకుంటే ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగవు.

– వడ్డే నరసింహ, తెల్లాపూర్

కఠిన చర్యలు తీసుకుంటున్నాం..



చెరువులు, కుంటలు, వరద కాలువల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. కబ్జాదారులపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. ఇప్పటికే అనేకమందిపై కేసులు నమోదు చేశాం.

– సంతోషిని, ఏఈ,ఇరిగేషన్

ఘనంగా మార్కండేయ జయంతి వేడుకలు



మార్కండేయ వేడుకల్లో పద్మశాలీలు



వెంకటాపూర్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో..

నారాయణఖేడ్: మార్కండేయ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ శివార్లలోని మార్కండేయ భవన్‌లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, ధ్వజారోహణం కార్యక్రమాలు నిర్వహించారు. కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్ మాట్లాడుతూ మార్కండేయుడు కారణజన్ముడన్నారు. భక్తి మార్గంతోనే మోక్షం పొందవచ్చని నిరూపించిన గొప్ప మహనీయుడని కొనియాడారు.

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండలంలోని వెంకటాపూర్ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో భక్త మార్కండేయ మహర్షి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం భవనంలో మార్కండేయ స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు లక్ష్మణ్, రాములు, రాజు, బుచ్చి రాములు, బాలరాజు, తుల్జారం, నర్సింలు, శంకర్, అంబదాస్, రామకృష్ణ, హరి పాల్గొన్నారు.

జహీరాబాద్ పట్టణంలో

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలో శనివారం మార్కండేయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు గడ్డం జనార్దన్ ఆధ్వర్యంలో జయంతి వేడుకల్లో పద్మశాలీలు పాల్గొన్నారు. పట్టణంలోని మార్కండేయ ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. అనంతరం పట్టణంలో శోభయాత్ర నిర్వహించారు.

15న అవార్డు విచారణ

నారాయణఖేడ్: నిజాంపేట్- ఖేడ్- బీదర్ 161బీ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి ఈనెల 15న నారాయణఖేడ్‌లో అవార్డు విచారణ నిర్వహించనున్నట్లు ఆర్డీఓ అశోక చక్రవర్తి పేర్కొన్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఖేడ్ పట్టణం పక్కగా నిర్మించనున్న పైవంతెన, రహదారి వల్ల భూములు, స్థలాలు, ఇళ్లు, భవనాలు కోల్పోతున్న బాధితులతో ఈ అవార్డు విచారణ ఉంటుందన్నారు. 56 సర్వే నంబర్‌లో ఉన్న బాధితులను విచారణ నుంచి మినహాయిస్తున్నామని తెలిపారు. అవార్డు విచారణకు హాజరయ్యే బాధితులకు వ్యక్తిగతంగా నోటీసులు ఇస్తున్నామని చెప్పారు.

ఘనంగా ధ్వజారోహణం



పూజలు చేస్తున్న జీయర్‌స్వామి

సంగారెడ్డి టౌన్ : పట్టణ శివారులోని వైకుంఠపురం దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ధ్వజారోహణ కార్యక్రమంనిర్వహించారు. అహోబిల జీయర్ స్వామి జెండాను ఆవిష్కరించారు. భక్తుల జై శ్రీమన్నారాయణ నామస్మరణతో ఆలయం మార్మోగింది. మహిళలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కుష్టువ్యాధిని నివారిద్దాం



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల వైద్యాధికారి మధుకర్ ఆధ్వర్యంలో స్పర్శ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కుష్టువ్యాధి రహిత సమాజాన్ని నిర్మించాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కుటుంబంలో లేదా ఇరుగుపొరుగు వారిలో చర్మంపై స్పర్శ కోల్పోయిన, ఒంటిపై మచ్చలు ఏర్పడి వాటిని తాకినప్పుడు నొప్పి కలగకపోతే కుష్టు వ్యాధి లక్షణాలుగా గుర్తించాలన్నారు. ఈ లక్షణాలు కలిగిన వారు వైద్యుల సలహా సూచనలతో చికిత్స పొందాలని సూచించారు. వ్యాధి సోకిన వారిపట్ల వివక్ష చూపరాదని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, వైద్య బృందం శ్రీనివాస్, స్వరూప, ఆశావర్కర్‌లు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులు అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

సంగారెడ్డి టౌన్ : స్త్రీలపై లైంగిక వేధింపులను అరికట్టాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేష్ అన్నారు. శనివారం జిల్లా పరిషత్ కార్యాలయంలో లైంగిక వేధింపుల చట్టంపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనిచేసే ప్రదేశాల్లో స్త్రీలపై లైంగిక వేధింపులు చేసినట్లయితే వారిపై కఠినంగా శిక్షలు అమలు అవుతాయని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జానకి రాం రెడ్డి, డీపీఓ సాయిబాబా, ఉద్యోగులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బడ్జెట్‌పై కార్మికుల నిరసన



బడ్జెట్ పత్రాలను దహనం చేసిన కార్మికులు

హత్నూర(సంగారెడ్డి): కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మికులకు అన్యాయం చేసిందని నిరసిస్తూ హత్నూర మండలం నస్తీపూర్ గ్రామ శివారులోని లోటస్ చాక్లెట్ పరిశ్రమ కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ బడ్జెట్ కి ముందే నిన్న ప్రకటించిన ఆర్థిక సర్వేలో కార్మిక వ్యతిరేకమైన నిర్ణయాలు, పని గంటల పెంపు గురించి చెప్పినట్లే చేశారని మండిపడ్డారు. ఈ బడ్జెట్ కూడా కార్మికులకు వ్యతిరేకంగా ఉందన్నారు. నిరసన కార్యక్రమంలో సీఐటీయూ యూనియన్ మండల నాయకులు శేఖర్, వీరేశం, యాదగిరి, శ్రీనివాస్ తదితరులు కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

ఎస్టీపీ నిధుల కేటాయింపుపై హర్షం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ ఎస్టీపీ ఏర్పాటుకు నిధులు సాధించడంలో ఎంపీ రఘునందన్ రావు ఎంతో కృషి చేస్తున్నారని తెల్లాపూర్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు రాంబాబు గౌడ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ శంషాబాద్ రాజు తెలిపారు. శనివారం సాయంత్రం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రచారానికి వచ్చిన సమయంలో ఎంపీ రఘునందన్ రావుకు ఇక్కడ ప్రజలు ఎస్టీపీ ప్లాంటును ఏర్పాటు చేయాలని కోరారు. ఎంపీ రఘునందన్ రావు ఎస్టీపీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ విషయంపై ఎప్పటికప్పుడు అధికారులను సంప్రదించి త్వరగా చేయాలని కోరారు. ఎంపీ చొరవతో రాష్ట్ర ప్రభుత్వం రూ.60 కోట్ల నిధులు కేటాయించడంపై సంతోషం వ్యక్తం చేశారు. నిధుల విడుదలకు కృషి చేసిన ఎంపీ రఘునందన్ రావుకు, రాష్ట్ర ప్రభుత్వానికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులను ప్రవీణ్ యాదవ్, ప్రసన్న, రాజిరెడ్డి, కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌ఐలకు పదోన్నతి

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఏఎస్‌ఐలు పదోన్నతి పొందారు. సాబీద్, కోహీర్ ఏఎస్‌ఐ కిష్టయ్యలకు ఎస్‌ఐలుగా పదోన్నతి లభించింది. శనివారం పోలీస్‌స్టేషన్ సిబ్బంది వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. విధులపై అకింతభావంతో చేస్తే పదోన్నతులు వస్తాయన్నారు. జహీరాబాద్‌టౌన్ ఎస్‌ఐ కాశీనాథ్ సాబీద్‌ను సన్మానించి వీడ్కోలు పలికారు.

సంక్షిప్త వార్తలు

◆ **సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ**

వట్‌పల్లి(అందోల్): మండలంలోని మర్వెల్లి గ్రామంలో మంజూరైనా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం లబ్ధిదారులకు మాజీ స్కోర్ చైర్మన్ పి.సంగమేశ్వర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలు కార్పొరేట్ స్థాయిలో వైద్య పొందేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బస్వరాజ్, నురందయ్య, శ్రీశైలం పాల్గొన్నారు.

◆ **క్రైస్తవుల అభివృద్ధికి కృషి**

రామచంద్రాపురం (పటాన్ చెరు): క్రైస్తవుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కాటా సుధాగౌడ్ అన్నారు. శనివారం పట్టణంలోని బాలాజీ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన పాస్టర్ల అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు.

◆ **మందిరాలకు స్థలాలు కేటాయింపు**

రామచంద్రాపురం (పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు ప్రభుత్వ డబుల్ బెడ్ రూం కేసీఆర్‌నగర్‌ను శనివారం తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డి, సీఐ రవీందర్, వివిధ శాఖల అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రార్థన మందిరాల కోసం కేటాయించిన స్థలాన్ని వారు పరిశీలించారు. అనంతరం చర్చి, మజీద్, దేవాలయం కోసం కేటాయించిన స్థలాలను అక్కడి వారికి చూపించారు.

◆ **చిన్నారులకు అక్షరాభ్యాసం**

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సరస్వతీ దేవిని విద్యార్థులు భక్తిశ్రద్ధలతో పూజించారు. అనంతరం అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించి, విద్యార్థులకు జ్ఞానం ప్రాముఖ్యత వివరించారు.

◆ **నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం**

పటాన్‌చెరు టౌన్: సబ్‌స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా ఆదివారం ఉ.11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పటాన్‌చెరు డివిజన్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఏఈ జగదీశ్వరరావు శనివారం తెలిపారు. పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతం, బండ్లగూడ, భూపాల్‌రెడ్డి కాలనీ, నేతాజీ నగర్, బాలాజీనగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సంగారెడ్డి పట్టణంలో..

సంగారెడ్డి: పట్టణంలో 33/11 కేవీ సంగారెడ్డి టౌన్ 2 సబ్‌స్టేషన్‌లో పరిధిలో మరమ్మతులు కొత్త ఏబీ స్విచ్చుల బిగింపు కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఉ.9 గంటల నుంచి 12 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు .

తాగునీటి ఎద్దడి లేకుండా చూడండి

రాష్ట్ర మిషన్ భగీరథ(ఆర్‌డబ్ల్యూఎస్) చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు



చాల్కిలో చేతి పంపును పరిశీలిస్తున్న చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు

న్యాల్‌కల్(జహీరాబాద్): గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మిషన్ భగీరథ(ఆర్‌డబ్ల్యూఎస్) చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు అన్నారు. ప్రత్యేక రక్షిత మంచి నీటి సరఫరా (స్పెషల్ డ్రైవ్)లో భాగంగా శనివారం మండలంలోని చాల్కి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని ఇంటింటికి తిరిగి నీటి సరఫరా ఎలా జరుగుతుందని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని నీటి ట్యాంక్‌లు, చేతి పంపులను పరిశీలించారు. గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో నీటి సమస్య రాకుండా ఉండేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ట్యాంక్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని సూచించారు. ముఖ్యంగా పైప్‌లైన్ లీకేజీ వల్ల నీరు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున లీకేజీలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. తాగునీటి సరఫరాకు సంబంధించి కొత్త కనెక్షన్‌లు అవసరమున్నా వారు గ్రామ పంచాయతీలో దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. నీటి సరఫరాకు సంబంధించి 8 రకాల రికార్డులు ఉంటాయని వాటిని ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. ట్యాంక్‌లు, పైప్‌లైన్ మరమ్మతుల కోసం నిధులు అవసరమైతే నివేదికలు తయారు చేసి, పంపితే నిధులు మంజూరవుతాయని అధికారులకు తెలిపారు. అనంతరం చాల్కి సమీపంలో వాటర్ ఫిల్టర్ బెడ్‌ను సందర్శించారు. ఆయన వెంట ఎస్‌ఈ రఘువీర్, ఈఈ విజయలక్ష్మి, డిప్యూటీ ఈఈలు సాబేర్ హుస్సెన్, నరేంద్ర తదితరులు ఉన్నారు.

చీడపీడలపై అప్రమత్తంగా ఉండాలి

ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ



పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

హత్నూర (సంగారెడ్డి): రైతులు పండించే వరి, మిర్చి, ఉల్లిగడ్డ తదితర పంటలపై ఆశించే చీడపీడల నివారణపై రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఏరువాక వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ అన్నారు. శనివారం హత్నూర మండలం పన్యాల గ్రామంలో ఏరువాక కేంద్రం (డీఏటీటీసీ) సంగుపేట్, వ్యవసాయ పరిశోధన స్థానం తోర్నాల శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో వరి, ఉల్లిగడ్డ, టమాట, మిరప పంటలపై రోగనిర్ధారణ క్షేత్ర సందర్శన నిర్వహించారు. ప్రధానంగా వరిలో చీడ పీడలు, తెగుళ్ల యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. వరి పంటలో అక్కడక్కడ కాండం తొలుచు పురుగు గాయ లక్షణాలు గమనించామన్నారు. నివారణకు ఎకరాకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు 10 కిలోలు ఇసుకలో కలిపి సమానంగా చల్లాలని తెలిపారు. ఉల్లిగడ్డ పంటలో తామర పురుగు నివారణకు ఫిప్రోనిల్ 2.మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ముఖ్యంగా టమాట పంటలో ఎక్కువగా ఆశించే పాముపొడ తెగుళ్ల నివారణకు థయోమిథాక్సమ్ 0.3 మీ.లీ లీటర్ నీటికి కలిపి సాయంత్రం వేళలో పిచికారీ చేయాలని సూచించారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మిరప పంటలో పైముడత , కిందిముడత ఎక్కువగా ఆశించిందని తెలిపారు. రైతులు పురుగు ఉధృతిని బట్టి డైఫెన్తూరాన్ 1.25 మీ.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్ర -సంగుపేట్ శాస్త్రవేత్తలు రాహుల్ విశ్వకర్మ, సరిత శాస్త్రవేత్త (ఉద్యానవన శాస్త్రం), వ్యవసాయ పరిశోధన స్థానం తోర్నాల శాస్త్రవేత్త శ్రీజయ (మత్తికా శాస్త్రం), వ్యవసాయ విస్తరణ అధికారి రమేష్, రైతులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందజేస్తాం



లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను ఇస్తున్న నాయకులు

జిన్నారం (పటాన్‌చెరు): ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరేలా కృషి చేస్తున్నామని కాంగ్రెస్ యువ నాయకుడు సుదర్శన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాదారం గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లకు వెళి ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేస్తుందని.. ఎవరూ అధైర్య పడవద్దని సూచించారు. కార్యక్రమంలో వెంకటేశ్‌గౌడ్, బాలరాజు, బాబురావు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంజిరెడ్డిని మండలికి పంపిద్దాం

పటాన్‌చెరు: ప్రముఖ పారిశ్రామికవేత్త అంజిరెడ్డిని ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీజేపీ ప్రకటించిందని ఆయనను గెలిపించాలని బీజేపీ అమీన్‌పూర్ అధ్యక్షుడు ఈర్ల రాజు ప్రచారం చేపట్టారు. పట్టణ పరిధిలోని పటేల్‌గూడ, కృష్ణారెడ్డిపేట ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... విద్యాధికుడిగా, పారిశ్రామికవేత్తగా సోషల్ వర్కర్‌గా అంజిరెడ్డి ప్రజలందరికీ సేవలు చేస్తున్నారని గుర్తు చేశారు. డిగ్రీ చదివిన వారందరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని సూచించారు.

బంజారాల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న రాములు నాయక్

సంగారెడ్డి : బంజారాల అభివృద్ధికి తన వంతు సహకారం చేయనున్నట్లు వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యుడు రాములునాయక్ అన్నారు. ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ ఆత్మీయ సమ్మేళనం జిల్లా కేంద్రంలోని జెడ్పీ హాల్‌లో మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్ నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాములు నాయక్ పాల్గొని మాట్లాడారు. దేశం, రాష్ట్రంలో బంజారాల అభివృద్ధికి రాష్ట్ర పర్యటనలో భాగంగా సంగారెడ్డికి వచ్చానని అన్నారు. బంజారాల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తున్నానన్నారు. సేవాలాల్ జయంతికి రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి బంజారాల కోసం ఆప్షనల్ హాలిడే జీఓ తెచ్చానని త్వరలో పూర్తి సెలవు దినంగా ప్రకటించేలా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ప్రకాష్ రాథోడ్, పూల్‌సింగ్ నాయక్, మాజీ జెడ్పీటీసీ రాజు రాథోడ్ అమర్‌సింగ్, రాజేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.